క్లుప్తంగా

రోడ్ల కూల్చివేత



అక్రమ రోడ్లను జేసీబీతో తొలగిస్తున్న అధికారులు

మొయినాబాద్ రూరల్: అక్రమంగా వెంచర్ల ఎదుట చేపడుతున్న రోడ్లను కనకమామిడి పంచాయతీ కార్యదర్శి సుదర్శన్, కారోబార్ మల్లారెడ్డి సిబ్బందితో కలిసి జేసీబీతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ కనకమామిడి రెవెన్యూ పరిధిలోని కేతిరెడ్డిపల్లి గేటు సమీపంలో సర్వే నెంబర్ 369, 371లలో అక్రమ వెంచర్ నిర్మాణం కోసం వేస్తున్న రోడ్లు నిలిపి వేయాలని నోటీసులు ఇచ్చామన్నారు. అయినప్పటికీ వాటిని పట్టించుకోకుండా సదరు నిర్మాణదారు వేస్తున్న రోడ్లను తమ సిబ్బందితో కూల్చి వేయించామన్నారు. 111 జీవో ప్రకారం ఎలాంటి అనుమతులు లేనప్పటికీ అక్రమంగా వెంచర్లు, రోడ్లు నిర్మిస్తే కూల్చివేయిస్తామని, బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

బీజేవైఎం అధ్యక్షుడు
బండారి చంద్రశేఖర్‌రెడ్డి



కేంద్ర పథకాలను ప్రచారం చేస్తున్న బీజేవైఎం నాయకులు

చేవెళ్ల: పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని బీజేవైఎం అధ్యక్షుడు బండారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన 'గావ్ చలో అభియాన్'లో భాగంగా శుక్రవారం మండలంలోని మల్లారెడ్డి గూడలో బీజేవైఎం నాయకులు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో బీజేపీ బూత్ స్థాయి కమిటీ సభ్యులతో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రజలతో మాట్లాడుతున్నారు. కేంద్ర పథకాలను ప్రచారం చేయటంతోపాటు గ్రామంలో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకే ఓటు వేయాలని, తమ అభ్యర్థులనే గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ బూత్ అధ్యక్షుడు మల్గారి శ్రీనివాస్‌రెడ్డి, మాధవరెడ్డి, బీజేవైఎం నాయకులు గుర్రాల మహేశ్వర్‌రెడ్డి, జైసింహారెడ్డి, అక్షయ్, తదితరులు పాల్గొన్నారు

అవినాశ్‌రెడ్డి, సాన్వి దంపతులకు సన్మానం



సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ జడల లక్ష్మి, శ్రీనివాస్‌గౌడ్

షాబాద్: జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, సాన్వి దంపతులను షాబాద్ వైస్ ఎంపీపీ జడల లక్ష్మి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి, సాన్వి వివాహ వార్షికోత్సవం సందర్భంగా షాబాద్ మండల కేంద్రంలోని వారి నివాసంలో ఆయా గ్రామాల బీఆర్ఎస్ శ్రేణులు కలిసి పూలమాలలు వేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచులు పోనమోని కేతన రమేష్‌యాదవ్, కుర్వ జయమ్మ సుదర్శన్, పోలేపల్లి పూజిత శ్రీనివాస్‌గౌడ్, రాందేవ్‌యాదవ్, సామ ప్రతాప్‌రెడ్డి, నక్క అవిలాష్‌గౌడ్, జడల సాయిచరణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రంలో డాక్టరేట్

మొయినాబాద్ రూరల్: రసాయన శాస్త్రంలో నెల్లుట్ల మనోజ్‌కుమార్ డాక్టరేట్ సాధించడం అభినందనీయమని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సాత్వికరెడ్డి పేర్కొన్నారు. రసాయన శాస్త్ర విభాగంలో 'సింథసిస్ అండ్ బయోలాజికల్ ఎవాల్యూయేషన్ ఆఫ్ నావెల్ ఫైవ్ మెంబర్డ్ ఎతెరో సైక్లిక్ కంపౌండ్స్' అనే అంశంపై ప్రొఫెసర్ ఎస్ నర్సింహ్మా పర్యవేక్షణలో మనోజ్‌కుమార్ పరిశోధన చేశారు. ఈ సందర్భంగా డాక్టరేట్ సాధించిన మనోజ్‌కుమార్‌ను కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శుక్రవారం వారు అభినందించారు. అనంతరం యూనివర్సిటీ కులపతి డాక్టర్ సిహెచ్ పురుషోత్తమ్‌రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డిలు మాట్లాడుతూ పట్టుదల, కృషి ఉంటే అనుకున్న లక్ష్యాలు సాధించొచ్చని పేర్కొన్నారు. ఉపకులపతి ప్రొఫెసర్ దామోదర్, రిజిస్ట్రార్ రవీందర్, కవిత, ఆచార్య క్రిష్టఫర్, సుందర్‌రామ్, రాజు, ప్రొఫెసర్ దాము, పరీక్షణ నియంత్రణ అధికారి జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో కంపు!

పారిశుద్ధ్య వారోత్సవాలతో మార్పు వచ్చేనా?

- కొందుర్గులో ఇళ్ల మధ్యే చేరుతున్న మురుగు
- ఫైపులైన్ లీకేజీలతో ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



ఇళ్ల మధ్య మురుగునీటి గుంతలు

కొందుర్గు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతిఒక్కరి విధి. రోజురోజుకు ఎక్కడో ఒకచోట తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు, ఇండ్లనుంచి వెలువడే నీరు రోడ్లపై చేరి బురదమయంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అవీ రోడ్డుపై చేరి రోజుల తరబడి ఉండడంతో దుర్గంధం వ్యాపింపజేస్తుంది. దీంతో అక్కడ దోమలు, ఈగలకు ఆవాసాలుగా మారి వ్యాధులను ప్రబలింపజేస్తున్నాయి. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహిస్తుంది. కానీ అక్కడ మురుగునీరు ఏరులై పారుతున్నా పట్టించుకునే నాథుడే లేరు. ఈ విషయంలో గ్రామాల్లో మార్పు కనిపించడం లేదు. అక్కడ అవగాహన కార్యక్రమాలు నిర్వహించేవారు కరువయ్యారు. కొందుర్గు మండల కేంద్రంలో రోడ్లపై మురుగునీరు చేరి చెరువుల్లా తలపిస్తూ కంపుకొడుతున్నాయి. రాత్రివేళల్లో దోమలు, ఈగల బెడద తట్టుకోలేకపోతున్నామని, కొందరు రోగాల బారిన పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇక గ్రామంలో ఎక్కడపడితే అక్కడ చెత్తా, చెదారం వేస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి పైపులైన్ల లీకేజీలతో నీరు కలుషితమవుతుందని చెబుతున్నా వినే అధికారులు కరువయ్యారని చెబుతున్నా రు. ప్రభుత్వం ఎన్ని పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహించినా ఫలితం శూన్యమని అధికారులను నిలదీస్తున్నారు.

దుర్వాసన భరించలేకపోతున్నాం



ఇళ్ల మధ్యే మురుగు నీరు చేరడంతో దుర్వాసన వెదజల్లుతుంది. ఈ వాసనను భరించలేకపోతున్నామని అధికారులకు విన్నవించుకున్న ఫలితం లేదు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. ఇక ఎవరికి చెప్పాలో తెలియడం లేదు.

– క్యాత్రమోని శ్రీలత, కొందుర్గు

దోమలు, ఈగల బెడద పెరిగింది



మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు, ఈగల బెడద పెరిగింది. దోమలు, ఈగలతో పలురోగాలు ప్రబలుతున్నాయి. ఈ విషయంలో అధికారులు పట్టించుకొని తగు చర్యలు తీసుకోవాలి.

– ఎండీ అలీ, కొందుర్గు

వైభవంగా రథోత్సవం

- పురవీధుల్లో ఊరేగింపు
- పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవ, జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. ప్రతి ఏడాది నిర్వహించుకోవడం ఆనావాయితీగా వస్తుందని నిర్వాహకులు తెలిపారు. మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి భూదేవి శ్రీదేవి సమేతస్యుడైన వేంకటేశ్వరస్వామిల ఉత్సహ మూర్తులను రథంపై ఉంచి గోవింద నామస్మరణతో గ్రామంలోని పుర వీధుల్లో ఊరేగించారు. ఆంజనేయ స్వామి ఆలయం వరకు ఈ రథాన్ని భక్తులు లాగారు. దారిపొడవున భక్తులు రథంపై కొలువు దీరిన దేవతలకు పూజలు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టిబందోబస్త్ ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద స్వామి వారికి అభిషేకం, అర్చన తదితర కార్యక్రమాలను ప్రధాన పూజారులు శ్రీకాంత్, శ్రీపాదు, వాసుదేవాచార్యులు, వామనాచార్యులు నిర్వహించారు. ఈ వేడుకల్లో దేవస్థానం మేనేజర్ నరేందర్, చేవెళ్ల నాయకులు డీవీఆర్, నర్సింహ్మారెడ్డి, అగిరెడ్డి, యాదగిరి, వెంకట్‌రెడ్డి, రామస్వామి, కుమార్‌గుప్తా, నర్సింలు, విఠలయ్య, అనంత్‌రెడ్డి, శ్రీనివాస్, నవీన్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ ఎస్ఐ రవీంద్రనాయక్



మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్రనాయక్

షాద్‌నగర్: వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్ఐ రవీంద్రనాయక్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలో మరియారాణి ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆక్స్‌ఫర్డ్ పాఠశాలల్లో ట్రాఫిక్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ రవీంద్రనాయక్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, ఇటీవల జరిగిన ప్రమాదాల్లో ఎక్కువ శాతం హెల్మెట్ ధరించకపోవడంతోనే మృత్యువాత పడ్డారని అన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి, పాఠశాలల ప్రిన్సిపాల్స్ అలెగ్జాండర్, రిజ్వాన్, ట్రాఫిక్ సిబ్బంది నర్సింహ్మా, వెంకట్‌రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



సమ్మె వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న రామస్వామి, సత్యనారాయణ

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె రామస్వామి, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణలు పేర్కొన్నారు. చేవెళ్ల మండలంలోని అనెక్స్ గ్లాస్ కంపెనీ వద్ద శుక్రవారం కార్మికులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. కార్మిక సంఘాలు హక్కుల పరిరక్షణకు ఈ సమ్మె నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమ్మెను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని వారు కోరారు. అనంతరం వారు సమ్మె వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో మండల నాయకులు డి శివయ్య, ఎం సత్తిరెడ్డి, జె అంజయ్య, మంజుల, రమాదేవి, మాధవరెడ్డి, రంజిత్, లింగం, శ్రీకాంత్, భాస్కర్, రామచందర్, ప్రకభాకర్, సునీల్, రాజు, ఐలయ్య, కృష్ణ, కృష్ణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు గురుకులాల ప్రవేశ పరీక్ష

మొయినాబాద్ రూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదోతరగతిలో చేరేందుకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చేవెళ్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు విద్యార్థులు ఉదయం 9 గంటలకు ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. హాల్‌టికెట్ తీసుకోని వారు డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ పరీక్ష 11వ తేదీ ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు, దీనికి రెండు గంటల ముందే సెంటర్‌కు చేరుకోవాలని ఆమె పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాస కాలనీకి చెందిన జంగమ్మ మృతి చెందిన విషయం తెలుసుకొని శుక్రవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు సభ్యుడు జగన్, చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన రూ.3 వేలను కుటుంబసభ్యులకు జగన్ అందించారు.

ఉచిత విద్యుత్ అమలుకు చర్యలు

విద్యుత్ ఏఈ సీతారాములు

ఆమనగల్లు: ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి పథకంలో భాగంగా గృహ వినియోగదారులకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆమనగల్లు విద్యుత్ ఏఈ సీతారాములు తెలిపారు. వినియోగదారుల ఇంటికి విద్యుత్ సిబ్బంది వచ్చినప్పుడు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ వివరాలు అందించి బిల్లింగ్ మెషీన్‌లో నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఇంటివద్ద వివరాలు నమోదు చేసుకోనివారి కోసం ప్రత్యేకంగా ఆమనగల్లు పట్టణంలోని గాంధీచౌక్ చౌరస్తాలో ఉన్న విద్యుత్ వినియోగదారుల కేంద్రంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఇంటికి వచ్చిన సమయంలో వివరాలు నమోదు చేసుకోనివారు ప్రత్యేక కేంద్రం వద్దకు వచ్చి వివరాలు నమోదు చేసుకోవాలని ఏఈ సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది గోపాల్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించండి

- ఎంపీఓ విఠలేశ్వర్‌జీ
- పలుగుట్టలో స్వయం సహాయక సంఘాలతో సమావేశం, శ్రమదానం



చేవెళ్ల: మహిళా సంఘాల సభ్యులతో శ్రమదానం నిర్వహిస్తున్న విఠలేశ్వర్‌జీ

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని చేవెళ్ల ఎంపీఓ, ప్రత్యేకాధికారి విఠలేశ్వర్‌జీ అన్నారు. చేవెళ్ల మండలంలోని మల్లారెడ్డిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం స్వయం సహాయక సంఘాల సభ్యులతో ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు గ్రామంలో తడి, పొడి చెత్త నిర్వహణ, ఉపాధి హామీ పనులు, పారిశుద్ధ్య నిర్వహణ, స్వయం ఉపాధి, ఆరోగ్యం, తదితర అంశాలపై చర్చించడం జరిగిందన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు పారిశుద్ధ్య వారోత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బాల్‌రాజ్, పంచాయతీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్: బాకారం గ్రామాన్ని మాజీ ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కెవి రమణచారి దత్తత తీసుకొని అభివృద్ధికి ఎంతో కృషి చేశారని బాకారం మాజీ సర్పంచ్ సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. డాక్టర్ కెవి రమణచారి జన్మదిన వేడుకల్లో బాకారం మాజీ సర్పంచ్ సుధాకర్‌యాదవ్‌తో పాటు పలువురు నాయకులు నగరానికి తరలివెళ్లి ఆయనను ఘనంగా సన్మానించారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ చేస్తున్న సభ్యులు

మాడ్గుల: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడమే ఐక్యతా ఫౌండేషన్ లక్ష్యమని అన్నారు. మాడ్గుల మండల పరిధిలోని అర్కపల్లి, అవురుపల్లి, కొలుకులపల్లి, నాగిళ్ల, మాడ్గుల ప్రభుత్వ పాఠశాలలో ఐక్యతా ఫౌండేషన్ చైర్మెన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో అందించిన స్కాన్ అండ్ లెర్న్ పుస్తకాలను శుక్రవారం ఆ ఫౌండేషన్ సభ్యులు పంపిణీ చేశారు. పదవ తరగతి విద్యార్థుల కోసం ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కాన్ అండ్ లెర్న్ డిజిటల్ కంటెంట్ పుస్తకాలను రూపొందించామన్నారు. పాఠ్య పుస్తకాల్లో ఉన్న పాఠాలను విభజించి ఒక్కో పాఠానికి క్యూఆర్‌కోడ్ రూపొందించి ఆ పాఠం యొక్క సారాంశం, క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా వీడియోల రూపంలో విద్యార్థులకు అందుతుందని తెలిపారు. దీంతో విద్యార్థులు పాఠాలను సులభంగా అర్థం చేసుకోగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు.. మల్లయ్య, శివ, సుధాకర్, ఈరమల్ల శివ, ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఓబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి

తుర్కయంజాల్: కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం నాయకుడు రావులకోల్ నరేష్ కోరారు. జంతర్ మంతర్ వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నిర్వహించిన ఓబీసీల మహాధర్నాలో ఆయన పాల్గొన్నారు.

మురుగు కాలువ పనులు చేపట్టండి

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని ప్రతిభానగర్ కాలనీలో మురుగు కాలువ పనులను చేపట్టాలని కాలనీవాసులు కోరారు. ప్రతిభానగర్ కాలనీలో శుక్రవారం కౌన్సిలర్ లక్ష్మణ్, కమిషనర్ శ్యాంసుందర్ పర్యటించారు. ప్రతిభానగర్ కాలనీలో నిర్మించాల్సిన భూగర్భ మురుగు కాలువ నిర్మాణా నికి స్థల పరిశీలన చేశారు. ఎన్నికల కోడ్ వల్ల మురుగు కాలువ పనులు నిలిపివేశా మని త్వరలో ప్రారంభించి పూర్తి చేస్తామని కమిషనర్ శ్యాంసుందర్ వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



షాబాద్: పీఆర్టీయూ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మండల అధ్యక్షుడు సుదర్శన్



మొయినాబాద్: ప్రధానోపాధ్యాయుడిని సన్మానించిన సంఘం నాయకులు

పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సుదర్శన్

షాబాద్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి చేస్తోందని మండల అధ్యక్షుడు సుదర్శన్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలో పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవా న్ని పురస్కరించుకుని సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అన్ని రకాల సదుపాయల కల్పనకు ఉపాధ్యాయ సంఘం ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. టీచర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. 1971 నుంచి ఇప్పటి వరకు పీఆర్టీయూ అంచెలంచెలుగా ఎదుగుతూ వందల సంఖ్యలో తమ సమస్యలను పరిష్కరించిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షుడు యాదయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణ, రాష్ట్ర బాధ్యులు ఎల్ నర్సింహులు, డేవిడ్‌రెడ్డి, అంజయ్య, జిల్లా బాధ్యులు ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, గోవింద్, మండల బాధ్యుడు హనుమంతు, ఖాజపాషా, అంజి, సింహాద్రి నాయుడు, నరేశ్, రాజేంద్రప్రసాద్, తదిత రులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: మండల కేంద్రంలోని సిద్ధార్థ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. సంఘం అభివృద్ధికి సేవలందించి, ఉద్యోగ విరమణ పొందిన కుమారస్వామి, ప్రధానోపాధ్యాయుడు పెంటయ్యను వారు సన్మానించారు. మండల అధ్యక్షుడు బందయ్య, కార్యదర్శి కృష్ణ, గౌరవ అధ్యక్షుడు రాములు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, నరేందర్‌రెడ్డి, లక్ష్మణ్, భీమ్లా, మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి'తో పేదలకు మేలు

- 15 వరకు లబ్ధిదారుల వివరాల సేకరణ
- 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలుకు ప్రభుత్వం కసరత్తు



మరియాపురంలో వివరాలు సేకరిస్తున్న ఏఈ నరేందర్‌నాయక్

షాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు గృహజ్యోతి పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 15వరకు లబ్ధిదారుల వివరాలు సేకరించాలని ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో సిబ్బంది ఇంటింటి సర్వేను ముమ్మరం చేశారు.

కేటగిరీ–1లో దాదాపు 10 లక్షల మంది..

ఇబ్రహీంబాగ్ సెంటర్‌కు కేటగిరీ–1 కింద గృహ విద్యుత్ వినియోగదారులు దాదాపు 10 లక్షల మంది ఉన్నారు. ప్రతి నెలా మాదిరిగానే బిల్లింగ్ చేస్తూ వినియోగదారుల వివరాలను సిబ్బంది సేకరిస్తున్నారు. రేషన్ కార్డు ప్రమాణికం కావడంతో బిల్లింగ్ మిషన్లో అదనంగా లబ్ధిదారుడి వివరాలు నమోదు చేసేందుకు ఇటీవల ఆప్షన్ ఇచ్చారు. అందులో ఆధార్, రేషన్‌కార్డు, ఫోన్, మీటర్ నంబర్ వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీ వరకు లబ్ధిదారుల వివరాలను బిల్లింగ్ మిషన్‌లో పొందుపర్చాలని స్పష్టమైనా ఆదేశాలు రావడంతో సర్వేను ముమ్మరం చేశారు. బిల్లింగ్ సిబ్బంది, లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు, అర్టిజన్లు ఇంటింటికీ తిరుగుతున్నారు. అద్దెకు ఉంటున్న వారి వివరాలు సైతం సేకరిస్తున్నారు.

80 శాతం అర్హులు..

ఇబ్రహీంబాగ్ సెంటర్‌కు దాదాపు 10లక్షల సర్వీస్ నంబర్లు ఉండగా ఇందులో 80 శాతం మంది నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వాడుతున్నారని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. కాగా ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలకు 100 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం కొనసాగుతుండగా ఇక నుంచి వారికి సైతం గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు వినియోగించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.